నమస్తే తెలంగాణ

## కోతల కూతలు

**ఎవుసాన్ని** ఎటమటం చేయాలని కంకణం కట్టుకున్నట్టు మాట్లాడుతున్నారు పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి. మచ్చుకు రైతుల ఉచిత కరెంటు మీద ఆయన వేస్తున్న కుప్పిగంతులు చూస్తే సరిపోతుంది. అమెరికా కదా ఎవరికి తెలుస్తుంది అని రైతులకు మూడు గంటల కరెంటు చాలని నోరు జారారు. దొంగతనం దాచేస్తే దాగదు కదా? పిల్లి కండ్లు మూసుకుని పాలు తాగితే లోకానికి తెలియదా? ఆ మాట గుప్పుమనడంతో సమర్థనలతో కాలయాపన చేస్తున్నారు. పూటకో మాటతో కాంగ్రెస్ అసలు రంగు బయటపెడుతున్నారు. తప్పు మీద తప్పు చేస్తూ అడ్డంగా దొరికి పోతున్నారు. పొలం అంతటికీ నీరు పారించాలంటే మూడు గంటలు ఎలా సరిపోతుందన్న ప్రశ్నకు సమాధానం చెప్పలేక పది హెచ్‌పీల మోటర్లు పెట్టుకోమని ఉచిత సలహా ఇచ్చారు. అదసలు సాధ్యమేనా? ఇలా కరెంటుపై నోటికి వచ్చింది మాట్లాడేస్తున్న రేవంత్ వ్యవసాయ పరిజ్ఞానం మీద సందేహాలు వ్యక్తం కావడం గమనార్హం.

ఈ సందర్భంగా మూడు ప్రశ్నలు తలెత్తుతాయి. మూడుగంటల కరెంటు అంటే రోజులో ఏ మూడు గంటలు? ఉదయమా, సాయంత్రమా, పగలా, రాత్రా? అనేది మొదటిది. ఇప్పుడు చాలా బావుల మీద ఉన్నవి మూడు హెచ్‌పీలు, ఐదు హెచ్‌పీల మోటర్లే. మరి పది హెచ్‌పీల మోటర్లు పెట్టాలంటే వేలకోట్లు ఖర్చు అవుతుంది. ఆ ఖర్చు ఎవరిస్తారు? అనేది రెండో ప్రశ్న. రాష్ట్రంలో సుమారుగా 28 లక్షల వ్యవసాయ పంపుసెట్లు ఉన్నాయి. ఖర్చు ఎవరు భరిస్తారనేది పక్కన పెట్టి అందరూ పది హెచ్‌పీ మోటర్లు పెట్టుకున్నారనే అనుకుందాం. అన్ని మోటర్లు ఒక్కసారిగా ఆన్ చేస్తే అంత లోడ్ ఎక్కడ నుంచి వస్తుంది? అంత స్థాపిత సామర్థ్యం ఉందా? గ్రిడ్ కుప్పకూలితే ఏమవుతుంది? అనేది మూడో ప్రశ్న. అయితే రేవంత్ వాచాలత వల్ల ఒక మేలు జరిగింది. కాంగ్రెస్‌కు తప్పిదారి ఓటేస్తే ఎట్ల ఆగం చేస్తదో ఆయన మాటలు తెలియజేస్తున్నాయి. ఆయన గొప్పగా చెప్పుకొంటున్న కర్ణాటక పరిస్థితి చూస్తే కాంగ్రెస్ మార్కు పరిపాలన ఎలా ఉంటుందో అవగతమవుతుంది. అక్కడ సాగుకు ఐదు గంటల కరెంటు ఇస్తామని చెప్పి అదీ ఇవ్వలేక చతికిలబడింది.

బీఆర్‌ఎస్ పాలనలో తెలంగాణలో ఎవుసం పచ్చగా కళకళలాడుతున్నది. రైతుల ముఖాల్లో సంతోషం పండుతున్నది. 24 గంటల నాణ్యమైన, ఉచిత కరెంటు, పుష్కలంగా సాగునీరు, పంట పెట్టుబడికి రైతుబంధు, ఆపతి వస్తే ఆదుకునేందుకు రైతుబీమా, అందుబాటులో ఎరువులు, విత్తనాలు, చివరిగింజ వరకూ ప్రభుత్వమే కొనుగోలు, ధాన్యం నిల్వ చేసుకునేందుకు దండిగా గిడ్డంగులు.. ఇది కదా ఇప్పుడు మన ఎవుసం తీరుతెన్నులు. ఇది చూసి కన్ను కుట్టిందో ఏమో రేవంత్‌కు. బాగుపడ్డ సాగును పడావుపెట్టి రైతును ఆగం జేద్దామని అనుకుంటున్నారు. సీఎం కేసీఆర్ పరిపాలనా నైపుణ్యానికి, సంక్షేమ సహృదయానికి ప్రతీకలాంటి 24 గంటల కరెంటుపై అష్టాంకర మాటలు పేలుతున్నారు. కాంగ్రెస్ పాలనలో అర్ధరాత్రి అపరాత్రి గంటల కొలతలతో ఇచ్చిన కరెంటు కష్టాలు రైతులకు తెలుసు. ఎరువుల కోసం మూడు గంటలకు, మూడు పంటలకు ఉన్న తేడా తెలుసుకుని ఎవరిని మూలకు పెట్టాలో, ఎవరిని ముందుకు తేవాలో కూడా వారికి తెలుసు.

# కేసీఆర్ హ్యాట్రిక్ పక్కా..!

ఆ మధ్య ఉన్నట్టుండి వైయస్ షర్మిల, నేను తెలంగాణలోనే పుట్టాను, పెరిగాను, చదువుకున్నాను, తెలంగాణ కోడల్ని కూడా అంటూ సొంత (ఎ) జెండాతో ఒక పార్టీ పెట్టారు. అమాయకులు, అల్ప సంతోషులు కొందరు ఆమె వెంట చేరారు. మొత్తం 119 స్థానాల్లో మా పార్టీ పోటీ చేస్తుందని కూడా ఈ మధ్యనే అన్నారామె. అప్పు, సప్పు చేసి, ఆస్తులమ్మి ఈ అల్ప సంతోషులంతా బాగా డబ్బు ఖర్చుపెట్టుకున్నారు. మళ్లీ ఉన్నట్టుండి షర్మిల, వాళ్ల అన్న జైలు పాలు కావడానికి కారణమైన కాంగ్రెస్‌లో చేరారు. ఆమె మీద ఆశలు పెట్టుకున్న అమాయకులంతా దుమ్మెత్తిపోశారు. ఒకరిద్దరు ఆత్మహత్యా ప్రయత్నం కూడా చేశారు. ఎవరేమైపోతేనేం.. ఇప్పుడు షర్మిల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు సపోర్ట్ చేస్తున్నారు. ఇక ఆమె కూడా ప్రచారం చేస్తారట.



మనోహర్ చిమ్మని

**తె**లంగాణ టీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్‌ను పిలిచి, ఈ మధ్యే జైలు నుంచి బయటికి వచ్చిన ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు, మనం తెలంగాణ ఎన్నికల్లో పోటీ చేయటం లేదు. కాంగ్రెస్‌కు సపోర్ట్ ఇస్తున్నామని చెప్పాడట. అప్పటిదాకా ఓ వంద కోట్ల దాకా ఖర్చు పెట్టుకున్న జ్ఞానేశ్వర్‌కు ఒక్క దెబ్బతో జ్ఞానోదయమైంది. రాత్రికి రాత్రే ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి, చివరికి తాను చేరాల్సిన గమ్యం చేరుకున్నారు. తెలంగాణలో ఇంకా అడుగు బొడుగు మిగిలిన టీడీపీ శ్రేణులు మాత్రం ఎన్నికల్లో కాంగ్రెస్‌కు సపోర్ట్ చేస్తున్నాయి. అసలు టీడీపీని ఎన్టీఆర్ స్థాపించిందే కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా అన్నది వెన్నుపోటు బాబుకు గుర్తుండని ఒక చెదలు పట్టిన చరిత్ర. ఇప్పుడు కాంగ్రెస్‌కు టీడీపీ ఎన్నికల్లో సపోర్ట్ చేస్తుందన్నది మాత్రం ఒక ఓపెన్ సీక్రెట్.

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైందన్న బాధతో 11 రోజులు అన్నం మానేసిన పవన్ కళ్యాణ్‌కు, ఊసరవెల్లికి పోటీ పెడితే కచ్చితంగా పవర్‌స్టారే గెలుస్తాడు. అప్పుడప్పుడు అవసరం కోసం తెలంగాణకు అనుకూలంగా సినిమాటిక్ డైలాగులు చెప్తాడు కానీ, ఈయన అంతరంగం పూర్తిగా చంద్రబాబుకు అనుకూలం. అటు బీజేపీ అంటాడు, ఇటు బాబు అంటాడు. అసలు ఈయన పార్టీ పెట్టింది ఎందుకో అర్థం కాక ఈయన పార్టీకి చెందిన జనసైనిక్స్ అందరూ తికమక పడీ పడీ, అసలు ఆలోచించడం మానేశారు. అక్కడ బాబుతో ప్రేమ. ఇక్కడ బీజేపీతో లివ్-ఇన్ రిలేషన్‌షిప్. వెరసి, పవన్‌కళ్యాణ్ ఇక్కడ ఎన్నికల్లో బీజేపీతో కలిసిపోయి కేసీఆర్‌కు వ్యతిరేకంగా పనిచేస్తున్నాడు.

బీజేపీకి తెలంగాణలో నాలుగైదు సీట్లు వస్తే ఎక్కువే అన్న నిజం తెలిసి కూడా, ఢిల్లీలో ఆ పార్టీకి చెందిన ప్రధాని నరేంద్ర మోదీ సహా, కేంద్రమంత్రులు, ఇతర అతిరథ మహారథులంతా ఇటే దృష్టిపెట్టారు. రాష్ట్రాల్లో ఎన్నికైన ప్రభుత్వాలను రకరకాల కుట్రలతో, కొనుగోళ్లతో కూలగొట్టి అధికారం



సంపాదించుకునే వారి కల్చర్ ఇక్కడ కూడా కొనసాగించడానికి ఏ క్షణమైనా ఏదో ఒక అవకాశం దొరుకుతుందన్న అత్యాశ వారిది.

పక్కనే ఉన్న తార్నాకలో బీర్లు తాగి, బిర్యానీ తినేవాళ్లు అని, అడ్డా మీద కూలోళ్లు అని ఈ మధ్యే ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులను అనడం ద్వారా తన స్థాయి ఏమిటో మరొక్కసారి తానే రుజువు చేసుకున్న తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఇప్పుడు కేసీఆర్‌పై కామారెడ్డిలో పోటీ చేస్తున్నారు. ఉద్యమ సమయంలో ఉద్యమకారులపైకి తుపాకీతో కాల్చడానికి వెళ్లిన ఘన చరిత్ర ఇతనికి ఉన్నది. తెలంగాణ వచ్చాక, బాబుతో కలిసి కేసీఆర్ ప్రభుత్వాన్ని కూలగొట్టడం కోసం చేసిన కుట్రలో రెడ్‌హ్యాండెడ్‌గా దొరికి జైలుకు వెళ్లి నేరస్థుడు. రైతుబంధు వేస్ట్ అంటాడు. రైతుకు 3 గంటల కరెంటు చాలంటాడు. నిరుద్యోగ యువకులతో కూరగాయలు అమ్మిస్తానంటాడు. అట్టర్ ఫ్లాప్ అయిన అమరావతిని ఉదాహరణగా చూపిస్తూ, అదేవిధంగా రాచకొండ పరిసరాల్లో వేల ఎకరాలు రైతుల దగ్గర తీసుకొని కొత్త నగరం ఏదో నిర్మిస్తానంటాడు. తెలంగాణ భౌగోళిక పరిస్థితులు, చరిత్ర, సంస్కృతి, ప్రజలు, పరిపాలన, అభివృద్ధి, సంక్షేమం గురించి కేసీఆర్‌తో పోలిస్తే అ,ఆలు కూడా రాని రేవంత్‌రెడ్డి కేసీఆర్‌పై పోటీ చేస్తున్నారు. రేపు నేనే ముఖ్యమంత్రిని అని కలలు కంటున్నారు.

ఐదు గ్యారంటీలతో పక్కన కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు అక్కడ ప్రారంభం నుంచి ముఖ్యమంత్రి ఎవరన్న కొట్లాటతోనే సరిపోతున్నది. కనీసం ఒక్క గ్యారంటీని కూడా నెరవేర్చే పరిస్థితి, సమర్థత అక్కడ లేదు. రోజుకు 5 గంటల కరెంటు ఇవ్వడానికే చచ్చిపోతున్నామంటూ అక్కడి కాంగ్రెస్ నాయకులే అంటున్నారు. మరి అలాంటప్పుడు ఇక్కడ 6 గ్యారంటీలను ఎలా నెరవేర్చగలుగుతారు? ఇలాంటి అవగాహనారాహిత్యం, అసమర్థత నేపథ్యంతో తగుదునమ్మా అంటూ కర్ణాటక నుంచి కాంగ్రెస్‌కు చెందిన 40 మంది ఎమ్మెల్యేలు, 10 మంది మంత్రులు, ఇంకొందరు ధనిక వర్గ నాయకులు ఇప్పుడు తెలంగాణ రాజకీయాలను ప్రభావితం చెయ్యడానికి కట్టకట్టుకొని వచ్చారని సమాచారం. వీళ్లంతా ఎలక్షన్ ప్రచారం పేరుతో రేవంత్‌రెడ్డి చేస్తున్న జుగుప్సాకరమైన రచ్చకు తోడుంటారు. ఇంకేం ప్లాన్లు వేస్తున్నారో తెలియదు. బీఆర్‌ఎస్ నాయకుల మీద ఎన్నడూ లేనివిధంగా ఈ మధ్య భౌతికదాడులు జరుగుతుండటం వెనుక ఉన్న కుట్రదారులెవరన్నది కూడా ఈ నేపథ్యంలో అధ్యయనం చేయాల్సి ఉన్నది.

కష్ట సమయంలో భారతదేశపు ఆర్థిక చిత్రపటాన్ని సమూలంగా మార్చిన పీవీ నరసింహారావు లాంటి మేధావి రాజకీయ నాయకున్ని అహంకారపూరిత కుట్రలతో పక్కనపెట్టిన ఢిల్లీవాళ్లకు ఇప్పుడు దేశంలోనే ఉనికి లేకుండాపోయింది. ఒకప్పుడు కాంగ్రెస్‌కు కంచుకోట లాంటి తెలంగాణలో ఎలాగైనా ఈసారి పాగా వేయాలన్న ఉద్దేశ్యంతో దేనికైనా సరే అన్నట్టుగా ఉన్నారు. ఆ పార్టీ బై డిఫాల్ట్ అధినేత్రి సోనియా గాంధీ. తెలంగాణకు సంబంధించి ఏదైనా పేపర్ మీద రాసిస్తే తప్ప ఒక్క వాక్యం కూడా మాట్లాడలేని రాహుల్, ప్రియాంక ఎలక్షన్లు అయ్యేదాకా ఇక్కడే తెలంగాణలోనే ఉంటామంటున్నారు.

మరోవైపు, కాంగ్రెస్‌కు బలమైన అభ్యర్థి ఉన్నారనుకున్న చోట బీజేపీ, బీజేపీకి బలమైన అభ్యర్థి ఉన్నారనుకున్న చోట కాంగ్రెస్ తమ వైపు నుంచి బలహీనమైన అభ్యర్థులను ఏదో నామ్‌కే వాస్తే అన్నట్టుగా నిలబెట్టారని కూడా పేపర్లు రాస్తున్నాయి, చానెళ్లలో చెప్తున్నారు. స్వయంగా ఆయా పార్టీల వాళ్లే చెప్తున్నారు.

కట్ చేస్తే... అష్టదిక్కుల నుంచి ఇలా ఎన్ని వ్యతిరేక శక్తులు ఏకమై వచ్చినా, ఎన్ని కుయుక్తులు పన్నినా, ఇక్కడ ఏం ఫరక్ పడదు. కేసీఆర్ రాజనీతి ముందు, ఇలాంటి సమయాల్లో ఆయన కదిపే పావుల ముందు, పెట్టే చెక్‌ల ముందు వీళ్లంతా ఉట్టి పిపీలికామాత్రులు.

తెలంగాణ రాష్ట్రం కోసం గొంగలి పురుగునైనా ముద్దు పెట్టుకుంటానని చెప్పిన కేసీఆర్, ఉద్యమ సమయంలో తప్ప ఎన్నడూ ఇలాంటి పనికిమాలిన పొత్తుల కోసం అసలు ఆలోచించలేదు. తెలంగాణ సమాజం అంతా తన వైపు ఉన్నదన్న విషయం ఆయనకు తెలుసు. తెలంగాణ సాధించి, తెలంగాణను దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్తున్న కేసీఆర్‌ను ఇప్పుడు కాపాడుకోవడం ఎంత చారిత్రక అవసరమో తెలంగాణ ప్రజలకు తెలుసు.

**ఇంతమంది ఒకవైపు. కేసీఆర్ ఒక్కడు ఒకవైపు. ఎవరు గెలుస్తారన్నది ఇంతకుముందే చరిత్రలో రికార్డయి ఉన్నది.**

**జస్ట్ ఔర్ ఏక్ ధక్కా, కేసీఆర్ హ్యాట్రిక్ పక్కా.**

'రాష్ట్రంలోని 30 లక్షల మంది నిరుద్యోగ యువత ఆయుధాలు పట్టుకొని అడవిలో కలువాలె' అని రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి స్టేషన్ ఘన్‌పూర్‌లో ఇటీవల చేసిన వ్యాఖ్యలు అత్యంత ఖండనీయమైనవి. యువతను రెచ్చగొట్టేలా రేవంత్ చేసిన ఈ విద్వేషపూరిత ప్రసంగం కేవలం ముఖ్యమంత్రి కేసీఆర్ మీద విషం చిమ్మేందుకేనని ప్రజలకు అర్థమవుతున్నది. ఇది తెలంగాణను తెర్లు చేసే కుట్రపూరిత వైఖరి. తమ కాంగ్రెస్ పార్టీకి అధికారం దక్కకపోతే రాష్ట్రాన్ని ఆగంజేస్తాం, ప్రజలు ఏమైపోయినా మాకు అవసరం లేదనే ధోరణి రేవంత్ రెడ్డిలో స్పష్టంగా కనపడుతున్నది.

## గుల్గుడు గుల్గుడే.. గుద్దుడు గుద్దుడే



సహస్ర

**ఎ**న్నికల వేళ ఎట్లనన్న జేసి గెలువాలని కాంగ్రెస్ పార్టీ, ముఖ్యంగా రేవంత్‌రెడ్డి అనుసరిస్తున్న విధానం బాగా లేదు. ఆయన హావభావాలు, ఆక్రోశం నుంచి వస్తున్న ప్రకటనలు, చేస్తున్న చేష్టలు, రేవంత్ ద్వేషపూరిత, హింసాయుత మానసిక స్థితిని తెలియజేస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ గెలిస్తే తెలంగాణ ప్రజలకు ఏం చేస్తుందో చెప్పకుండా సీఎం కేసీఆర్‌పై వ్యక్తిగత దూషణలు చేస్తుండటం విడ్డూరం. రేవంత్‌రెడ్డి ప్రతీకారేచ్ఛతో చేసిన ప్రసంగం తెలంగాణ ప్రజలను ఒక్కసారి ఉలిక్కిపడేలా చేసింది. జనం లేక వెల వెలబోతున్న కాంగ్రెస్ సభలే కాంగ్రెస్ పార్టీకి ఓటమి ఖాయమని రుజువుచేస్తున్నాయి. దీంతో సహనం కోల్పో తూ వ్యవహరిస్తున్న రేవంత్ తీరు, అనుసరిస్తున్న పద్ధతు లు రాజకీయ విశ్లేషకులను సైతం ఆశ్చర్యచకితులను చేస్తున్నాయి. ఇంకా విషాదం ఏమంటే మీడియా ప్రతినిధులనూ దూషించడం లాంటి దిగజారుడు చేష్టలతో రేవంత్‌రెడ్డి తీరు సొంత పార్టీ నాయకులకే పెద్ద తలనొప్పిగా మారుతున్నది.

రేవంత్‌రెడ్డి వాడుతున్న బూతు పదజాలాన్ని తెలంగాణ ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇప్పుడే ఇంత ఆగంజేస్తున్న రేవంత్‌రెడ్డి పుసుక్కున గెలిస్తే గినా ఇంకెంత ఆగం జేస్తడోనని ఊహించుకుంటేనే ఒళ్లు జలదరిస్తున్నదని ప్రజలు వాపోతున్నారు. ఇటువంటి స్వార్థపూరిత నాయకుల పట్ల అప్రమత్తంగా ఉండాలనే ఆలోచన ప్రజల్లో ముందుగానే మొదలవడం శుభ పరిణామం. తెలంగాణను ఆగం జేసిన కాంగ్రెస్ పార్టీ గెలిస్తే నెలకో ముఖ్యమంత్రి చొప్పున కొట్లాటలే తప్ప రాష్ట్రంలో స్థిర ప్రభుత్వం ఉండదని ప్రజలకు స్పష్టమైంది. కాంగ్రెస్ పార్టీలో అయ్యే కొట్లాటలు, కుమ్ములాటలు రాష్ట్రాన్ని ఏ దరికి చేరుస్తాయోనని ప్రజలు ఇప్పటికే అయోమయంలో పడ్డారు.



ఏ మాత్రం సహనం, ఇంగితం లేకుండా వ్యవహరిస్తున్న టీపీసీసీ అధ్యక్షుని వ్యవహారం తెలంగాణ సమాజానికి తెలియందేం కాదు. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థుల మీదికి గన్నులెత్తి సమైక్యవాదుల మోచేతి నీళ్లు తాగిన దృశ్యాలను తెలంగాణ సమాజం ఎప్పటికీ మర్చిపోదు. కష్టపడి త్యాగాలతో తెచ్చుకున్న తెలంగాణను తెర్లు చేయాలని కుట్రలు పన్నుతున్న ఈ విద్వేషపు నాయకులు 'మాకు ఓటు వేయండి' అంటే నమ్మేంత అమాయకులు కాదు తెలంగాణ ప్రజలు. అరువై ఏండ్ల కింద వచ్చిన తెలంగాణను ఆంధ్రోళ్లకప్పజెప్పి వందలాది మంది ప్రాణాలను తీసింది కాంగ్రెస్. మలిదశ ఉద్యమంలో తెలంగాణ ప్రజల ఆగ్రహానికి గురై అనివార్య స్థితిలో తెలంగాణను ప్రకటించిక తప్పలేదు. ఇలాంటి పార్టీకి తెలంగాణ సమాజం ఎందుకు ఓటేస్తది? అట్లా తెలంగాణ ప్రజలు ఆలోచిస్తరనుకోవడమే కాంగ్రెస్ పార్టీ చేస్తున్న పెద్ద తప్పు.

'ఒక్క చాన్స్ ఇద్దాం'లే అని ప్రాణాలు తీసే ప్రమాదానికి ఎవరైనా అవకాశం ఇస్తారా? ఇచ్చి తమ ప్రాణాలను తామే తీసుకుంటారా? ఉంటయి, అవును ఉంటయి. కుటుంబం అన్నంక మంచి, చెడు పంచాయితీలుంటయి. అలుగుళ్లు, గులుగుళ్లు ఉంటయి. ఇంట్ల ఉన్న మన నాయిన మీద అలుగమా, గులుగమా? మన ఇంటోళ్ల మీద గులుగకుంటే మంది మీద గులుగుతమా? గులిగితే వాళ్లు ఊకుంటరా? ఎంత గులిగినా, అలిగినా మోకా వచ్చినప్పుడు ఒక్కటైతం తప్ప బయటోనికి, మందికి అవకాశం ఇస్తమా? ఇప్పుడు కూడా అంతే...

తెలంగాణ రావడం కష్టమే అన్న సమయంలో రాష్ట్రాన్ని సాధించిన వ్యక్తి కేసీఆర్. వచ్చిన తెలంగాణను నిలబెట్టేందుకు ఆయన పడ్డ కష్టాలు తెలంగాణ సమాజానికి తెలియనివి కావు. వ్యవసాయం, విద్యుత్తు, సాగు, తాగునీరు, విద్య, వైద్యం ఇట్లా అన్ని రంగాల్లో తెలంగాణను బలోపేతం చేసిన మహోన్నత నాయకత్వం ముఖ్యమంత్రి కేసీఆర్‌ది.

తనతో అవకాశవాదులు, పదవుల కోసం పార్టీలను కబ్జాచేసే దగాకోరులతో పోటీ ఏమిటో? ఒక్క ముక్కల చెప్పాలంటే ఇది తెలంగాణ సమాజానికే అవమానకరం. గులుగుడు, గులుగుడు వరకే. కేసీఆర్‌కు మద్దతిచ్చుడు మద్దతిచ్చుడే.. కేసీఆర్‌తో తెలంగాణ సమాజానిది పేగు బంధం. అందుకే ఆయనను మూడోసారి ముఖ్యమంత్రిని చేసుకుంటే తప్ప, తమకు సంపూర్ణ క్రాంతి సాధ్యం కాదని తెలంగాణ సమాజం బలంగా విశ్వసిస్తున్నది. సీఎంగా తిరిగి కేసీఆర్‌ను ఎన్నుకోవాలంటే గులుగుడు, గులుగుడే, గుద్దుడు గుద్దుడే. దేనిది దానికే.. ఇదీ ఇవ్వాళ తెలంగాణ సమాజం ఆలోచిస్తున్న ధోరణి. అందుకే కేసీఆర్ నాయకత్వంలో సమర్థవంతమైన నాయకత్వాన్ని, సుస్థిర ప్రభుత్వాన్ని కొనసాగిద్దాం.

## ఘర్షణల జోలికి వెళ్లం

ఇతర దేశాలతో ఘర్షణల్లో చిక్కుకోవడానికి మాది చాలా చిన్న దేశం. ఘర్షణల కోసం మా విదేశాంగ విధానాన్ని ఉపయోగించుకోవడంపై నాకు ఆసక్తి లేదు.

**- మహ్మద్ మయిజ్జు, మాల్దీవులు అధ్యక్షుడు**



## అస్థిరతా, సుస్థిరతా?

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ ప్రజల మదిలో ఇప్పుడు మెదులుతున్న పదం సుస్థిర ప్రభుత్వం. బలమైన సర్కార్ ఏర్పడితే సుపరిపాలనకు నాంది పడుతుంది. రాజకీయ సంక్షోభానికి తావులేకుండా ప్రజల శ్రేయస్సుపై దృష్టి సారించవచ్చు. గత తొమ్మిదేండ్లలో కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఈ విషయాన్ని రుజువు చేసింది.



అక్కల మనోజ్
97001 76866

**స్వ**రాష్ట్రంలో ఒక్కసారి కూడా బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై రాజకీయంగా తిరుగుబావుటా ఎగురవేసిన దాఖలాల్లేవు. తత్ఫలితంగా రాష్ట్రం అన్నివిధాలుగా పురోగమించింది. జీఎస్‌డీపీ 14 లక్షల కోట్ల వరకు ఎగబాకింది. తలసరి ఆదాయంలో రాష్ట్రం దేశంలోనే నెంబర్ వన్‌గా నిలిచింది. సాగు, స్వచ్ఛమైన తాగునీరు అందించడంలో దేశానికి ఆదర్శంగా నిలిచింది. వ్యవసాయంలో విప్లవాత్మక ప్రగతి సాధించింది. తెలంగాణ తప్ప, దేశంలో 24 గంటల ఉచిత కరెంటు ఇచ్చే రాష్ట్రం లేదు. పారిశుద్ధ్య నిర్వహణ, పచ్చదనం పెంపు, రైతుబంధు వంటి సంక్షేమ పథకాలతో గ్రామాల రూపురేఖలు మారాయి. చెరువులు నిండుగా మారి మత్స్యకారులు, అన్నదాతలకు అదరువుగా నిలుస్తున్నాయి. ఐటీ ప్రగతి ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తున్నది. అందుకే ప్రజలు ఇప్పుడు సుస్థిర ప్రభుత్వ ఏర్పాటు గురించి చర్చించుకుంటున్నారు. బీఆర్‌ఎస్‌కు ఓటు వేస్తే లాభం ఏమిటి? కాంగ్రెస్ వైపు మొగ్గు చూపితే వచ్చే నష్టాలు ఏమిటని బేరీజు వేసుకుంటున్నారు.

కాంగ్రెస్‌కు ప్రత్యేకంగా శత్రువులెవరూ ఉండరు. ఆ పార్టీ నాయకులే ఒకరికొకరు కత్తులు దువ్వుకుంటూ, ఆధిపత్యం కోసం పంచాయతీలు పెట్టుకుంటూ ఉంటారు. దేశవ్యాప్తంగా ఆ పార్టీలో ఇదే పంథా కనిపిస్తున్నది. నిత్యం కలహాల్లో తలమునకలై ఉండే హస్తం నేతలు ప్రజలకు పాలనాపరమైన సమస్యలను తెచ్చిపెడుతుంటారు. వీళ్ల అస్థిరత గురించి ప్రజలు ఎన్నో ఉదాహరణలను నెమరు వేసుకుంటున్నారు. ప్రస్తుతం ఆ పార్టీ రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో అధికారాన్ని చెలాయిస్తున్నది. సుపరిపాలన ఏమో కానీ, కుమ్ములాటలు, అలకలకే నాయకులు సమయం మొత్తాన్ని వెచ్చిస్తున్నారు. అధికార వ్యామోహంతో కలిగే సమస్యలపై దృష్టిపెడుతూ, ప్రజలను పట్టించుకోవడమే లేదు. రాజస్థాన్‌లో గత ఐదేండ్లుగా కాంగ్రెస్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాత్ ముళ్ల కుర్చీపైనే కూర్చున్నారు. పార్టీ, పదవుల్లో ఆధిపత్యం కోసం ఆయనకు, ఆ పార్టీ అగ్రనేత సచిన్ పైలట్‌ల మధ్య నిత్యం వర్గ పోరు నడిచింది. ఆ తర్వాత 2020లో 18 మంది ఎమ్మెల్యేలతో కలిసి పైలట్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు బావుటా ఎగురవేశారు.

పాలనలో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టాలని సీఎం గెహ్లాత్‌కు వ్యతిరేకం గా సచిన్ పైలట్ 2023లో ధర్నాకు దిగారు. ఇం తలోనే అశోక్ గెహ్లాత్ ఏఐసీసీ చీఫ్ ఎన్నికల రేసులోకి వస్తారని ఊహాగానాలు వచ్చాయి. సీఎం పీఠాన్ని వదిలుకునేందుకు గెహ్లాత్ ఒప్పుకోలేదు. ఆయన వర్గానికి చెందిన 82 మంది ఎమ్మెల్యేలతో స్పీకర్‌కు రాజీనామాలను ఇప్పించారు. వాటిని స్పీకర్ ఆమోదించకపోవడంతో ప్రభుత్వం నిలబడింది. ఈ ఘటనతోనే కాంగ్రెస్ పెద్దలు ఏఐసీసీ అధ్యక్షుడి కోసం మల్లిఖార్జున ఖర్గే వైపు మొగ్గు చూపారు.

ఛత్తీస్‌గఢ్‌లో సీఎం భూపేష్ భగేల్, డిప్యూటీ సీఎం సింగ్‌దేవ్‌ల మధ్య పెత్తనం కోసం పోరు నడిచింది. సీఎం పీఠాన్ని పంచుకొమ్మనే ఒప్పందం ఉందని సింగ్‌దేవ్ వర్గం నిత్యం తమ అసమ్మతిని తెలియజేసేది. చివరాఖరికి సింగ్‌దేవ్‌కు ఉపముఖ్యమంత్రి పదవి ఇచ్చి అధిష్ఠానం నచ్చజెప్పింది. ఈ రెండు రాష్ట్రాలతో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి పీఠం కోసం నిత్యం కమల్‌నాథ్, జ్యోతిరాధిత్య సింధియాల నడుమ తగాదాలు ఉండేవి. సీఎం కుర్చీ దక్కలేదన్న అసంతృప్తితో జ్యోతిరాధిత్య సింధియా హస్తం పార్టీకి రాజీనామా చేశారు. ఈయన బాటలోనే ఆరుగురు మంత్రులు సహా 22 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌కు రాజీనామా చేయడంతో అక్కడి ప్రభుత్వం కుప్పగూలింది. గోతికాడ నక్కల్లా అధికారం కోసం వెంపర్లాడుతున్న బీజేపీ, వీరి మద్దతును కూడగట్టుకొని మధ్యప్రదేశ్‌లో అప్రజాస్వామిక ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. ఇక ఇటీవల అధికారం చేపట్టిన కర్ణాటకలోనూ కాంగ్రెస్ పరిస్థితి మారకపోవడం ఆ పార్టీ క్రమశిక్షణను తెలియజేస్తున్నది.

ఇవ్వన్నీ ఒకెత్తయితే, తెలంగాణ కాంగ్రెస్ దుస్థితి మరో ఎత్తు. కాంగ్రెస్‌లో సీఎం అభ్యర్థులు ఎక్కువ, కార్యకర్తలు తక్కువ అనే జోక్ తెలంగాణలో ప్రాచుర్యంలో ఉన్నది. ప్రతి నాయకుడు ఇక్కడ సీఎం కుర్చీ కోసం తహతహలాడే వారే. ఒకరికి ఒకరు బాహాటంగానే విమర్శలు చేసుకుంటారు. చిన్న స్థాయి సమావేశాల్లో కూడా సభామర్యాదల మీదికంటే, కుర్చీలు విరగ్గొట్టుకోవడం మీదే వీరికి ధ్యాస ఎక్కువ.

కాంగ్రెస్ వ్యవస్థ అంతా డబ్బు మీదే నడుస్తున్నదని ఆ పార్టీ నాయకులే బాహాటంగా ప్రకటిస్తున్నారు. కోట్లు పెట్టి, రేవంత్‌రెడ్డి పీసీసీ పీఠాన్ని కొనుగోలు చేశారని ఆ పార్టీ ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి గతంలో మండిపడ్డారు. డబ్బు సంచులు పోతేనే ఎమ్మెల్యే టికెట్లు ఇస్తున్నారని, ఆ పార్టీ నాయకులు ఆరోపిస్తూ రాజీనామాలు చేస్తున్నారు. గాంధీభవన్‌ను ముట్టడిస్తున్నారు. ఎన్నికల రణరంగం ఏమో కానీ, గాంధీభవన్‌లో సిగపట్లకే సమయం సరిపోవడం లేదు. ఎలక్షన్ ముందు వాతావరణమే ఇలా ఉంటే, పుసుక్కు న కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువస్తే రాష్ట్రం పరిస్థితి ఏమిటని ప్రజలు చర్చించుకుంటున్నా రు. నిత్యం కొట్లాటలతో కొత్త సమస్యలు తెచ్చే నాయకులకు అధికారాన్ని అప్పగిస్తే, పూర్వపు అంధకారం మళ్లీ వస్తుందని మాట్లాడుకుంటున్నారు. సుస్థిరపాలన అందించే బీఆర్‌ఎస్ ప్రభుత్వమే రాష్ట్రానికి శ్రీరామ రక్ష అని వాళ్లు భావిస్తున్నారు.

